


# కృతజ్ఞత

మల్లాది వెంకట కృష్ణమూర్తి

బస్‌స్టాండు చేరేసరికే బస్ ఆగి ఉంది. పూర్తిగా నిండివుంది. యభపడుతూనే వచ్చాను. నాకు నా భయం నిజం అయింది. పధ్నాలుగు మైళ్ళు నిల్చుని ప్రయాణం చెయ్యాలి, ఆ రద్దీలో.

అలా ప్రయాణం చేయగల వయసు కాదు నాది. మట్టిగడ్డమీద కుదుపు లెక్కువ. దానికితోడు మలేరియా తన గుర్తుగా వదిలిన బలహీనత.

బస్ ఎక్కాను. బహుశా పద్మనాభస్వామి నన్ను మెచ్చుకుంటాడు ఇలా అవస్థపడుతూ వెళితే. అప్పుడే పుణ్యం వచ్చేది.

బస్ బయలు దేరింది. కొద్దిగా తూలాను కుదుపుకి. బస్‌నిండా భక్తులే. కొండ ఎక్కుతోంది బస్ అప్పుడే. మలుపులే దారంతా.

"మాష్టారు మిమ్మల్నే." ఎవరో పిలిచారు, నా భుజం తట్టి.

ఏమిటన్నట్లుగా చూసాను.

"అక్కడ కూర్చున్న అమ్మాయి పిలుస్తోంది.''

అతను చూపించినవైపు చూసాను. పాతికలోపే వుంటాయి. సరిగ్గా నా కూతురు వయసు. అనుమానంగా చూసాను ఆ కొత్త అమ్మాయి వంక. నన్నే !

దారిచేసుకుని దగ్గరకు వెళ్ళాను.

"మీరు కూర్చోండి ఇక్కడ."

లేచింది.

మొహమాట పడలేదు. కూర్చు న్నాను వెంటనే ఎప్పుడో నా స్టూడెంటు అయివుంటుంది, లేకపోతే నన్నే గుర్తు పెట్టుకుని సీట్ ఇచ్చేవాళ్ళు అరుదు. నా వయసును చూసి నాకు సీట్ ఇచ్చేవాళ్ళు కూడా అరుదు. ఇప్పుడు యువతరం ఆలోచనలు మారాయి, నా చిన్నప్పుడు లాగా కాదు.

"థాంక్స్ అమ్మాయి. నువ్వు చాలా మంచిదానివి," అన్నాను.

నవ్వింది.

కొద్దిగా బలహీనంగావుంది. కదిలే బస్‌లో నించోటం అలవాటు లేనట్లుంది. దానికితోడు కొండమీదకువెళ్ళే రోడ్డంతా మలుపులే.

బస్ ఆగింది అందరూ దిగారు. నేనూ కూడా దిగాను. ఎదురుగా కన బడే గోపురానికి నమస్కరించాను. ఆ అమ్మాయికి మరోసారి కృతజ్ఞత తెలుపు కుందామనుకున్నాను. కాని కనపడలేదు.

క్యూలోంచి, దైవదర్శనం చేసు కున్నాక బయటికి వచ్చాను. కోనేటి ప్రక్కన కూర్చుని ఉంది ఆ అమ్మాయి. ప్రక్కన మొగుడయి వుండచ్చు.

''నమస్తే గుర్తున్నానా?" అడిగింది నవ్వుతూ.

ఓ సారి బట్టతల తడుముకున్నాను. కళ్ళజోడు సర్దుకున్నాను. తల అడ్డంగా వూపాను.

"ఏ బేచ్ ?" అడిగాను.

"అంటే ?"

"నా స్టూడెంట్‌వి కదా నువ్వూ ?"

"మరి టీచరా ?"

"కాదు మరి !"

"మరి పదహేడేళ్ళ క్రితం విజయ వాడలో ఉండేవారు కదూ ?"

"అవును. అప్పుడు తెలుసన్నాను?'' ఇంతకాలం నన్నెందుకు గుర్తుపట్టలేక పోయావో నాకు అర్థంకాలేదు.

"అప్పుడు నాకు పన్నెండో ఏడను కుంటాను నేనూ, మా తాతయ్యా రోజూ ఉదయం ఆరుగంటల బస్‌లో మంగళగిరి కెళ్ళెవాళ్ళం. బాగా రష్‌గా ఉండేది. ప్రతిరోజు లేచి మీరు తాతయ్యకి సీట్ ఇస్తుండేవారు."

"విజయవాడలో ఉంటూ గుంటూ రులో పనిచెస్తుండేవాణ్ణి అప్పుడు."

"అలా ఓ నెల జరిగాక తాతయ్య మంగళగిరిలోని టి. బి. హాస్పటల్‌లో చచ్చిపోయారు. ఎందుకో మీరు మాత్రం నాకు గుర్తుండిపోయారు."

మళ్ళీ ఏదో గొణిగాను.

''మీకు అప్పటి నుంచే కళ్ళజోడు, బట్టతల ఉండటం వల్లనేమో ?'' అన్నది ఆ అమ్మాయి నవ్వి.

నేనూ నవ్వాను.